# నేను నీ రైతును

అ. ల. నరసింహంగారు బి. ఏ

౧

"అమ్మా! టెలిగ్రాంవచ్చిందమ్మా,"

"ఎవరిదగ్గఱనుంచే?" "ఏమో నే!"

"నీవు బళ్లోకివెళ్ళి చదువు నేర్చుకున్నావుకదూ!"

"నాన్నగారే వొచ్చి చదువుకుంటారు లేవే."

"నీవు చదవలేవటే."

"టెలిగ్రాం చదివేటంతచదువు బళ్లో చెప్పరే."

"పోనీ! ఏవూరునుంచో చూడు!"

"మద్రాను!"

"నీ మొగుడుదగ్గఱనుంచేగా!"

"ఏమో!"

"అంతసిగ్గెందుకే!"

సాయంకాలము పొలానికివెళ్ళిన రామయ్యగారు వచ్చారు.

"వచ్చారూ? మీఅల్లుడుదగ్గఱనుంచి ఏదో వచ్చింది. చదవండి!"

"అల్లుడు బి. యల్ ప్యాసైయాడే!"

మబ్బులోనుంచి తొంగిచూచు చంద్రునిహాసంలాగ రమణమోము పైకన్పింప గదిలోనికి పారిపోయింది.

౨

"అమ్మాయీ! ఇంకా నిద్రపోతున్నావే!"

"లేచి చాలా సేపైనదమ్మా!"

"రాత్రి నిద్రపోలేదటే!" "ఊఁహూ!"

"ఒంట్లో కులాసాగా లేదామటే!"

"ఊఱికే నిద్రపట్టలేదే!"

"నీవు బందరుపోవాలీరోజున! జ్ఞాపకముందా?"

"ఏమో నే!"

"అమ్మాయీ! నీకు నేచెప్పే దేమీలేదు. కాని పుట్టినింటికి మెట్టినింటికి కీర్తి తే!"

"ఇవ్వేళే నే వెళ్ళడం అమ్మా! నా బుజ్జామ నెవరు పెంచుతారేయింక! ఆవూళ్ళో పాడిపంటా వుంటాయే! గన్నేరుపూలు, పొగడపూలు ధరించి సస్యాల మీదనుంచి సోకే చల్లనిగాలి నే నక్కడ అనుభవిస్తానా?"

"వీటికన్న యెక్కువ ప్రేమాస్పదమైనది లభించిన తర్వాత వీటిని మఱుస్తావే!"

"అలాకాదమ్మా! ఈ కోకిలల గానమాధుర్యాలు, యీప్రకృతిమాతప్రేమను యెడబాసి నే నుండ గలనటే!"

"భర్తయెదట ప్రపంచకమే మఱపువస్తుంది లేవే!"

"అమ్మా! నిన్ను మఱచి పోనే!"

రెండుచేతులతో ముఖం కప్పుకుని బోర్లాపడుకుంది కదలకుండా రమణ!

౩

"రమణా! కాఫీలో పంచదారవెయ్యలేదేమే?"

"ఇదిగో కావలసినంత వేసుకోండి. సరేనా!"

"నీవుకాస్త తాగుదు!"

"నాకు సయించదండీ!"

"పల్లెటూరిదానవు! తరవాణి చద్దన్నమే కాని అలవాటులేదు."

"ఏదో! మఱి మీరు పెళ్ళాడారుగా!"

"నీవు తాగకుండావుంటే నాకుమాత్రం యెలా వుంటుంది!"

"మీరు తాగుదురూ! నాకదే ఆనందం."

"నాకో?"

"నాసంతోషం చూచి!"

"త్వరగా కోర్టుకెళ్లాలి!"

"మీరు కచేరి చావట్లో కూర్చునేటప్పటికి తయారవుతుంది."

"ఎంతచమత్కారివే! ఏదీ నీ చిఱునవ్వొకసారి!"

౪

"మూడేళ్లయిందే యీప్లీడరీ వృత్తిలో ప్రవేశించి! చదువుకే అయ్యాయి యెనిమిదివేలయప్పు! పదెకరాలమ్మేసి అప్పుతీర్చాను. ఈమూడేళ్లఖర్చుకే తతిమ్మా పదెకరాలు అమ్మేసి యీరోజే బాకీదార్ల కిచ్చేశాను. ఇఁకపేలాగో తోచడంలేదు."

"ప్రియా! ఎప్పుడూ ఒకలాగే యుంటుందా?"

"ఒకలాగే వుండకేముంది గాఢాంధకారం! పది రూపాయలు, యీలాపుస్తకాలు మిగిలాయి. అంతకన్న యేమీ కన్పడటంలేదు."

"చూడండి యింకా!"

"ఎన్నాళ్ళని యీ చూడడం! రోజులు చూడడంతోటే ఉన్న ఆస్తి అంతా హరించుకు పోయింది. పుస్తకాలు అమ్మేస్తా!"

"అమ్మేసి!"

"ఏవూరైనా వెళ్ళి వర్తకం చేసుకోవడం మంచిది."

"వర్తకంవద్దూ ఏమీ వద్దు."

"ఐతే యేంచెయ్యామంటావు!

"నాకాసులపేరు, వడ్డాణం అమ్మేస్తే వేయి రూపాయిలు వస్తాయి. వీటితో ఐదారునెలలు కాపురం గడుస్తుంది. ఆపైనికూడ యిలాగేవుంటే ఆలోచిద్దాము. దైవానికి దయరాకుండా వుంటుందా?"

"దయరాకేం! ఇదంతా భగవంతుని కృపగాదా?"

౫

"నీనగలు నాలాపుస్తకాలు ఆఖరై పోయాయి కానిఅదృష్టదేవతమాత్రం యింకా ప్రసన్నంకాలేదు."

"అలా విచారించకండి!"

"నిన్ను ఆభరణవిహీనురాలిని గా చేసినా దైవానికి కృప గల్గిందికాదు యీషణ్మాత్రం!"

"అన్నిటికంటె మిన్నయగువారు మీరులేరానాకు! ఇంక యీదుఃఖాలన్ని సౌఖ్యాలుగానే పరిణమిస్తాయి నాకు!"

"మనమతమునందిట్టి సుగుణవతు లుద్భవించుటచేతనే పురుషులకు శాంతిగల్గుచున్నది."

"భార్య భర్తసుఖదుఃఖాలలో పాల్గొనకుండునా!"

"ఇప్పటికన్ని అయిపోయాయి. పాత్రసామానులు, కుర్చీలు, బల్లలు, మంచాలు ఇంకమిగిలాయి. ఇపుడు చేసేదేమిటింక? చేతకానీలేదు. ఇంతవరకు కాఫీ అయినా త్రాగలేదు.?"

"పెట్టెలో ఒక కాసుంది. అది మీరు కాఫీ త్రాగి మార్చిరండి! రెండురోజులు దానితో గడుస్తాయి."

"పోష్టు! పోష్టు!"

"ఏం!"

"టెలిగ్రాం వచ్చిందండి!"

"రమణా! మీనాన్నగారికి జబ్బుగావుందట! వెంటనే బయలుదేరి రమ్మన్నారు!"

"ఆఁ! నాన్నగారికి జబ్బా! అపాయమేమి లేదు కద!"

"భయపడవలసిన పనిలేదు. ప్యాసింజరులో వెడదాము!"

"ఏమోనండి! నాకుభయమేస్తోంది."

"రమణా! కాసు అమ్మేసి వస్తాను. ప్రయాణానికి సిద్ధంచెయ్యి!"

౬

"ప్రియా! చూడు నీపొలాలు! ఈయేడు పొగాకు ముమ్మరంగా పండింది. రెండువేలచిల్లర వస్తుంది పొగాకు అమ్మితే! ధాన్యం పదిపుట్లయాయి!"

"నాన్నగారు, అమ్మ లేనిలోటే కన్పిస్తోంది."

"నీకు పది యెకరాల సిస్తుకింద యివ్వాలసిన వెయ్యిరూపాయలుపోను రెండువేలు సుమారు లాభం వుంటుంది.

"అదిగో! మళ్లీ అలా అంటారేం! నా భూమి మీదికాదా!"

"స్త్రీవిత్తం అనుభవించే నిర్భాగ్యుణ్ణిచేస్తావా నన్ను! లాభంతో యీయేడు సుఖంగా కాలక్షేపం చేయవచ్చు."

"అలాగేలెండి! అబ్బాయి వస్తున్నాడు! రారా నాయనా! రామం!"

"నారామం పుట్టడంతోటే పెద్దమ్మ మనల విడిచి పోయింది."

"నాథా! పొలాలమధ్య పుట్టాం! పొలాల్లో జీవిస్తున్నాం తృప్తితో సుఖంగా!"

"నీవు యినాందారిణివి, నేను నీ రైతును."

"ఎప్పటికీ నేను మీదాసినే!"

రామున్ని ఎత్తుకొని ముద్దుల వర్షం కురిపించింది రమణ!